దీపావళి కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

# పరమాణువు




డా॥ కాలువ మల్లయ్య

“జగజ్జేత అలెగ్జాండర్ నాకు ఆదర్శం. దేశ రాజకీయాలనే మలుపుతిప్పగల సత్తా నాకుంది. నావెంట కోట్లమంది జనం... నా మాటే వేదం... వాక్కే శిలాశాసనం... నేను కనుసైగ చేస్తే చాలు... ఏం చేయడానికైనా సిద్ధంగా ఉన్న ప్రజావాహిని... డబ్బు, అధికారం అన్నీ అనుభవించాను నేను. రాజకీయాలను శాసించాను. నా మాటకు ఎదురన్నదే లేదు. నా దగ్గరకు వచ్చారా మీరు...? నేను యమలోకం రావాలా?... నన్నెవరనుకుంటున్నారు...? ఏంటిది...?” కోపంగా అన్నారు రావుగారు.

బొలబొలా నవ్వారు యమభటులు... ఆ నవ్వు పరమ భయంకరంగా ఉంది... వాళ్ల చేతుల్లోని రంపపు కత్తులు మరింత భయంకరంగా ఉన్నాయి.

హ... హ... హహ... హహ... హహ... యమభటులింకా నవ్వుతూనే ఉన్నారు.

“ఏం నవ్వది?... ఇందులో నవ్వే విషయమేముంది? ఆపండి... అసలు మీరిక్కడికెందుకొచ్చారు? మిమ్మలనెవరు పంపారు? నాకు యమలోకమా? హు...” మరింత కోపంగా అన్నారు రావుగారు.

“మానవా! పూర్వకాలంలో నువ్వు మీ రాష్ట్రానికి అధిపతివే కావచ్చు, కాని నువ్విప్పుడు మనిషివి కూడా కాదు... చనిపోయినవాడివి... ప్రేతాత్మవి. నీ చుట్టూ ఇప్పుడెవరూ లేరు చూడు...” అన్నారు భటులు.

నలుదిక్కులా చూసాడు రావు. “అవును. ఎవరూ లేరేంటి...? నా బంధువులు, నా వాళ్లు, స్నేహితులు వంధిమాగధ జనమంతా ఏమయ్యారు...?” ఆశ్చర్యపోతూ అన్నాడు.

వికటాట్టహాసం చేసారు భటులు...

“నీ తోటి రాజకీయవాదులంతా ఖాళీ అయిన సింహాసనం కోసం కొట్టుకు చస్తున్నారు... ఎవరికివారే తామే ప్రభువులుగా ప్రకటించుకుంటున్నారు. నీ ప్రాణం అనంతవాయువుల్లో కలవగానే సమీకరణాల్లో మునిగితేలుతున్నారు. నీ బంధువులు, భార్య, సంతానం ఆస్తులు స్వాధీనం చేసుకోవడంలో తలమునకలై ఉన్నారు. ఈ విషయం నీకు తెలుసా?” అన్నాడు భటులు.

“ఏ విషయం...?” ఆతురతతో అడిగారు రావుగారు...

“నేను నీకు చికిత్స చేస్తున్న డాక్టర్‌లో ప్రవేశించి, ఇలా అనిపించాను... ‘మీ ప్రభువు కోసం ఎవరైనా ప్రాణాలిస్తే అతడు బతుకుతాడు’ అన్నారు డాక్టర్‌గారు... ఒక్కరూ ముందుకు రాలేదు. ఇప్పుడు చెప్పు... నీ వాళ్లెవరో?”

రావుగారి ముఖంలో రంగులు మారుతున్నాయి.

“ఇవన్నీ మాట్లాడుతూ కూర్చునే సమయం కాదిది. పద...” అన్నాడు కత్తి ఝుళిపిస్తూ మరో భటుడు...

“ఏంటి? నేను నరకం రావాలా? రాజును నేను. నాకు నరకమా? నేను రాను...”

“రానననడానికి నువ్వెవరు...? మా ప్రభువు యమధర్మరాజు ఆజ్ఞ జారీ చేసాడు. మేమొచ్చాం. వాదనలు కట్టిపెట్టి మాతో రా... పాశంతో బంధించి తీసుకుపోయే పరిస్థితులు కల్పించకు... నడువ్” గట్టిగా అన్నాడు భటుడు.

వాళ్లననుసరించక తప్పలేదు రావుగారికి.

అతల... వితల... పాతాళలోకాలను దాటి యమలోకం చేరుకున్నారు వాళ్లు...

యమలోకం యమ బిజీగా ఉంది... పిడికెడేసి మీసాలతో సింహాసనంపై గంభీరంగా కూర్చున్నాడు యమధర్మరాజు. అతనికి కొంత దూరంలో నేలపై పరుచుకున్న పరుపులో చిత్రగుప్తుడున్నాడు... అతని ముందో బల్ల... దానిపై

దఫ్తరాలు (ఫైళ్లు). పక్కన గుట్టలు గుట్టలుగా కట్టలు... ఏవో లెక్కలు వేస్తున్నాడు చిత్రగుప్తుడు.

అటూఇటూ చూసారు రావుగారు... యమ లోకపు భటులు, ఇతరులు అంతా ఎవరిపనుల్లో వాళ్లు నిమగ్నమై ఉన్నారు... పాపులు కొందరు శిక్షలనుభవిస్తున్నారు. మరుగుతున్న నూనెలో వేయించబడుతున్న వాళ్లు, ఎర్రగా కాలిన పెనంపై దొర్లించబడుతున్నవాళ్లు... కొరడా దెబ్బలు తింటున్న వాళ్లు... జైలు గదుల్లో ఊచలు లెక్కబెడుతున్న వాళ్లు... రకరకాల శిక్షలను భవిస్తున్న పాపులు.

రావుగారు, యమభటులు యమరాజు చూపుకోసం ఎదురుచూస్తున్నారు...

"ప్రభూ... ప్రభూ..." పలుమార్లు పిలిచారు భటులు. విధినిర్వహణలో నిమగ్నుడై ఉన్న ప్రభువు వాళ్ల మాటలను వినిపించుకోలేదు... వాళ్ల దిక్కు కన్నెత్తి కూడా చూడడం లేదు.

"మాజీ ప్రభువైన తనపై ఇంత నిర్లక్ష్యమా?" తనలో తానే గొణుక్కున్నాడు రావుగారు... పాలకుడుగా తిరుగులేని అధికారాలు చలాయించిన తనకే ఇంత పరాభవమా...?

అతనికి కోపం వస్తోంది.

అసహనంగా కదులుతున్నాడు... "మనం వచ్చి చాలా సేపయ్యింది... యమరాజు ఇటు వైపు కన్నెత్తయినా చూడటం లేదు... మీలోకంలోనూ ఇంత ఆలస్యమా?" భటులతో అన్నాడు.

పకాపకా నవ్వారు భటులు.

"ఆలస్యం గూర్చి మీరా మమ్ములనడిగేది? మీ దగ్గర ఫించను రావడానికి ఎన్నేండ్లు పడుతుంది? మీ కోర్టుల్లో ఉన్న కేసులు పరిష్కారం కావడానికి ఒక జీవితకాలం సరిపోతుందా?"

భటుల మాటలతో రావుగారి నోరు మూతబడింది... యమరాజు చూపుకోసం ఎదురు



## రచయిత పరిచయం

డాక్టర్ కాలువ మల్లయ్య కరీంనగర్ జిల్లాలో జన్మించారు. 30 సంవత్సరాలకు పైగా సాహితీ వ్యాసంగంలో ఉన్న వీరు 650కి పైగా కథలు, 15 నవలలు, 350 వ్యాసాలు, 'తెలుగులో ప్రగతిశీల కథా సాహిత్యం' అనే అంశంపై Ph.D. గ్రంథం వ్రాసారు. వీరి రచనలపై రెండు Ph.D., అయిదు M.Phil. లూ వచ్చాయి. వివిధ పత్రికల నుంచి, సంస్థల నుంచీ 60కి పైగా అవార్డులు, బహుమతులూ లభించాయి. కథా సంపుటాలు, కవితా సంకలనాలు, నవలలూ 12 వెలువడ్డాయి


చూస్తున్నారు వాళ్లు.

"ప్రభూ...! ప్రభూ...!" మళ్లీ పిలిచారు భటులు.

ఈసారి తలపైకెత్తి చూసాడు యమధర్మరాజు. భటులు, రావుగారు అతనికి నమస్కరించారు.

ఏమిటన్నట్టు తల పంకించాడు ప్రభువు... "ప్రభూ...! రావుగారనే ఈ జీవిని మీ ముందు ప్రవేశపెడ్తున్నాము... ఇతనికి తాను విశాల ప్రాంతాన్ని చాలాకాలం ఏలానన్న అహంకారముంది. ఇతని సంగతి చూడండి" అన్నాడో భటుడు.

"రాజా...? అంటే...? ఏ గోళానికి రాజి తను? ఈ విశ్వంలోని ఏ ప్రాంతానికి...? చిత్రగుప్తా! ముందు ఈ జీవి ఎవరో తెలుసుకో..."




బాధ్యతను చిత్రగుప్తుని కప్పగించాడు యమప్రభువు... ఇద్దరు భటులు, రావుగారు చిత్రగుప్తుని దగ్గరకు వెళ్లి నిల్చున్నారు.

అతన్ని ఎగాదిగా చూసాడు చిత్రగుప్తుడు...

"అతల... వితల... పాతాళ... సర్వలోకాల్లోని జీవరాశుల లెక్కలు నాదగ్గరున్నాయి... గుట్టలుగా పేరుకుపోయున్న ఈ దఫ్తరాల్లోంచి ఈ జీవి వివరాలు సేకరించాలంటే కష్టమే..." అన్నాడు.

"మీరూ అదే మాట్లాడుతున్నారా? సువిశాల భూమిని... తెనుగు భాషా ప్రాంతాన్ని మూడు వేల ఆరువందల యాభై రోజులకు పైగా పాలించిన రాజును నేను... నా పేరు వార్తాపత్రికల్లో రాని రోజు లేదు... వివరాలు మీదగ్గర లేవా? అవమానం... అవమానం..." అన్నారు రావుగారు...

అతన్ని కింది నుంచి పైవరకూ చూసాడు చిత్రగుప్తుడు. "భటులారా...! ఈ జీవి మాట్లాడుతున్నదేంటి...? మన దగ్గర కోట్ల జీవరాశులున్నాయి... ఈ జీవి ఏ తెగలో కొస్తాడు...? చెప్పు జీవా? నువ్వెవరు...?" అన్నాడు...

"నేను మనిషిని... మనుష్యజాతి మాది..."

"మనిషి... మనుష్యజాతి... సరే... సరే..." ఫైళ్లు తిరగేస్తూ అన్నాడు చిత్రగుప్తుడు... "ప్రపంచంలో ఎన్ని జీవరాశులున్నా మెదడుతో పాటు ఆలోచన శక్తున్న జీవి ఒక్కటే... ఆ మనుషుల ఫైళ్లలో వెతకండి ప్రభూ..."

"ఆల... ఆల... మంచి ఆధారం దొరికింది. ఓహో.. మెదడున్న పశుజాతి అన్న మాట. ఈ మనిషి మనుగడ నాగరికమైన తర్వాతే పాపభారం పెరిగింది... కాలుష్యం పెరిగింది. ఉష్ణోగ్రత పెరుగుతోంది... భూగోళాన్ని నాశనం చేస్తున్నవాడా ఇతను..."

చిత్రగుప్తుని మాటలకు వణికిపోతున్నారు రావుగారు... "నేనేం చేయలేదు. నేనేం చేయలేదు..." అన్నాడు.

"నేను నిన్నొక్కడిని అనడం లేదు మనిషీ... మీ జాతిని..." అని, ఇంతకూ ఇతనిదే లోకం...?" అన్నాడు...

"భూగోళమొక్కటే కదా ప్రభూ మనుషులుండే చోటు..." అన్నాడు భటుడు.

"అయితే ఆ భూగోళంలో ఈ మనుషుడుండే చోటెక్కడ?"

రావుగారికి సహనం నశిస్తోంది. తానేంటో కూడా ఎవరికీ తెలియకపోవడం అతనికి కోపంగా ఉంది...

"మాది ఆసియా ఖండం... అందులో ఓ దేశం భారతదేశం... ఆ భారతదేశంలోని ఓ రాష్ట్రం తెలుగు రాష్ట్రం..." వివరణ ఇచ్చాడు రావుగారు...

ఫైళ్లు తిరిగేస్తున్నాడు చిత్రగుప్తుడు... "జంబూ ద్వీపే... భరతఖండే... ఇందులో... మీ రాష్ట్రం పేరే లేదు గదా...!"

'ద్రవిడ దేశంగా రాసుంటుంది ప్రభూ..." అన్నాడు భటుడు.

"ఆల... ఆల... దక్కను పీఠభూమిలోని ప్రాంతం... సరే కానీ జీవీ నువ్వేలిన నేలపై భాష.."

"తెలుగు..."

"తెలుగా...? ఆ భాషనేది ఒకటుందా...? మీ దేశ పార్లమెంటులోను, మీ పాలనా విభాగంలోనూ ఆ భాషను వాడుతున్న దాఖలాలు లేనేలేవే... ఈమధ్య మీ పిల్లలు కూడా దానిని చదువుతున్నట్టు లేరు..." అన్నాడు చిత్రగుప్తుడు.

"అవునవును..." తలవంచుకున్నారు రావుగారు.

"అంతనేలను పాలించిన నా పేరెక్కడా లేదా...?" అన్నాడు.

వాళ్లను గమనిస్తున్న యమధర్మరాజు "చిత్రగుప్తా...! భటులారా! ఈ జీవికి విశ్వాన్నంతా చూపించు... ఆ తర్వాతే నాదగ్గరకు తీసుకు రండి..." అన్నాడు

"చిత్తం ప్రభూ...!" అన్నాడు చిత్రగుప్తుడు. రావుగారికి దివ్యదృష్టిని ప్రసాదించాడు యమరాజు.

నక్షత్రాలు... కోట్లాది నక్షత్రాలు... ఎన్నెన్నో కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న నక్షత్రాలు... సూర్యుని కంటే పెద్దవి కొన్ని, చిన్నవి కొన్ని... కోట్లాది నక్షత్రాల్లో ఒకటైన సూర్యుని నుండి విడిపోయిన చిన్నశకలం ఏర్పడిన సౌర కుటుంబం... కోట్లాది సంవత్సరాలు మండి చల్లారిన భూగోళం. సౌర కుటుంబంలో తొమ్మిది గ్రహాలు... బుధుడు, శుక్రుడు, భూమి, అంగారకుడు, గురుడు, శని, యురేనస్, నెప్ట్యూన్, ప్లూటో...

నవగ్రహాల్లో భూమి ఒకటి. ఇందులో మూడు పాళ్లు నీరు... ఒక్క పాలు మాత్రమే భూమి, ధృవాలు... చల్లని ప్రదేశాలు...


సముద్రంలో లెక్కలేనన్ని జీవాలు... భూమిపై అనేక ఖండాలు, అనేక జీవులు... కులాలు... మతాలు... నాగరికతలు... సంస్కృతులు... మనుషులు... భాషలు... జాతులు...

సౌరకుటుంబం ఏర్పడి 4567 బిలియన్ సంవత్సరాలయిందని అంచనా... 32 మిలియన్ సంవత్సరాల తర్వాత భూమి, చంద్రుడు ఏర్పడ్డాయని అంచనా... లెక్కలేనన్ని జీవులు...

"మానవా! విశ్వాన్ని చూడటం అయిపోయింది కదా! ఇక పోదాం పద... యమధర్మరాజు దగ్గరికి" అన్నాడు చిత్రగుప్తుడు.

"హతమయ్యె నితాంత గర్వమున్... హతమయ్యె..." తనలో తాను గొణుక్కుంటూ ప్రభువు దగ్గరికెళ్లాడు రావుగారు...

"మానవా...! అండ పిండ బ్రహ్మాండాలను, సమస్త విశ్వాన్నీ తిలకించావు గదా! ఇప్పుడేమనిపిస్తోంది నీకు... నువ్వెవరో, నీ స్థానమేంటో అర్థమయిందా...?" అన్నాడు యమధర్మ




రాజు...

"అర్థమయింది... నన్ను నేను అన్వేషించు కుంటున్నాను..."

"ఇప్పుడు చెప్పుమరి... నువ్వు జీవించిన కాలమెంత...?"

"బుద్బుదప్రాయమంత కూడా కాదు..."

"నువ్వేలిన నేలెంత?"

"బిందువంత..."

"నీకు తెలిసిందెంత?"

"అణువంత కూడా కాదు..."

"ఇప్పుడు చెప్పు నువ్వేంటో...?"

"సముద్రంలో నీటిబిందువుని..."

"నీటి బిందువువా? నీటి బిందువులో అనేక పరమాణువులున్నాయని నీకు తెలియదా? నువ్వు నీటిపాదువంతటి వాడివా మానవా?"

"కాదు... కాదు... నేను నీటి బిందువంతటి వాడనీ కాను... ఇక ఏమాత్రమూ విభజింప డానికి వీలులేనంత పరిమాణం కలవాడిని. నేనో పరమాణువుని".

"పరమాణువు విభజింపబడుతుందని మీ మనిషే కనిపెట్టాడు. ఈ విషయం చదువుకో లేదా...?" నవ్వుతూ అన్నాడు యమధర్మరాజు.

"అయితే నేనో ఎలక్ట్రాన్‌ని... ప్రోటాన్‌ని... న్యూట్రాన్‌ని... నిజానికి నేనేమీ కాను... శూన్యాన్ని... శూన్యాన్ని..."

అరిచినట్లుగా అన్నారు రావుగారు...

"ఇప్పుడు నీలోని అహంకారం పూర్తిగా పోయింది. కానీ మనిషీ! నిన్ను నువ్వంత తక్కువ చేసుకోక..."

"ఏంటి ప్రభూ మీరనేది...?"

"ఈ సృష్టిలో నువ్వో పరమాణువన్న మాట నిజం... పరమాణువు అత్యంత చిన్నదే... కానీ, అది విస్ఫోటనం చెందితే ఉద్భవించే శక్తి అమోఘం... ఆ శక్తి లోక కల్యాణానికి ఉప యోగపడేది... లోక వినాశనానికి కాదు... అర్థ మయింది కదా మానవా...?" అంటూ సభ చాలించాడు యమధర్మరాజు. ●